క్లుప్తంగా

ధ్యానంతో ఆరోగ్యం



శిక్షణలో పాల్గొన్న సాధకులు

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ సీనియర్ మాస్టర్ ప్రకాశరావు అన్నారు. స్థానికంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న బాలాజీ కల్యాణ మండపంలో శుక్రవారం సామూహిక ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం చేస్తే మానసిక ఆనందం కలుగుతుందన్నారు. వ్యక్తిత్వం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనర్లు కోపూరి బిందుమాధవి, బాలాజీరావు పాల్గొన్నారు.

కిశోరీ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మి

జి.సిగడాం: కిశోరీ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు, బాల్యవివాహాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోర్ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం గ్రామస్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు ప్రత్యేక నిఘా వేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కుప్పిలి ఉమామహేశ్వరి, మహదాస్యం రాధిక, సువ్వాడ రమాదేవి, అలపాన భారతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

భవిత కేంద్రం పరిశీలన



సూచనలిస్తున్న రాష్ట్ర సహితవిద్య సమన్వయకర్త అమ్మినాయుడు

గార: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని రాష్ట్ర సమగ్ర శిక్ష, సహిత విద్య సమన్వయకర్త ఎన్.అమ్మినాయుడు పరిశీలించారు. శుక్రవారం కుమ్మరిపేట ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని సమీక్షించారు. బడి ఈడు గల ప్రత్యేక అవసరాల పిల్లలను ఈ కేంద్రంలో చేర్పించాలన్నారు. శిక్షణ గల ఉపాధ్యాయుల పరిశీలనలో విద్యార్థులకు బోధన ఉంటుందన్నారు. అనంతరం ఆరుగురు చిన్నారులను కేంద్రంలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గోవిందరావు, సహాయ సమన్వయకర్త వి.ఉమ, ఎంఈవోలు ఎస్.రామకృష్ణ, పి.వినోదిని, రిసోర్సు ఉపాధ్యాయులు ఎ.రఘులక్ష్మి, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల పరిశీలన



నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో గోపీబాల, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామంలో కొయ్యరాళ్ల నుంచి గ్రామం వెళ్లే రహదారి పక్కన రామసాగరానికి నీరు వెళ్లే బట్టిలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు అధికారులకు గురువారం ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో డీఎల్‌పీవో గోపీబాల ఈ నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. పంచాయతీరాజ్ నిబంధనల మేరకు నోటీసులు ఇచ్చి, నిర్మాణ అనుమతులు పరిశీలించాలని అధికారులకు సూచించారు. అక్రమం అని తేలితే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదులో వచ్చిన అన్ని నిర్మాణాలు పరిశీలించాలని అన్నారు. ఎంపీడీవో పీవీఎస్ రామ్మోహన్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ దేవి, గ్రామ కార్యదర్శి బేగంలతో చర్చించి పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని సూచించారు.

డయేరియాను అరికడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: డయేరియాను అరికడదామంటూ నైరా, బట్టేరు పంచాయతీ పరిధిలోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు పి.వి.ఎస్.ఎన్.మూర్తి, రాజేంద్రనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డయేరియా అరికట్టాలనే విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ ఆవరణలో నీటి పరీక్ష చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా జలజీవన్ మిషన్ కో–ఆర్డినేటర్ డి.దాలినాయుడు, పంచాయతీ సెక్రటరీలు హెచ్.వి.రవికాంత్, ఫల్గుణరావు, ఏఎన్ఎం లక్ష్మి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వస్తున్నాయ్.. జగన్నాథ రథచక్రాల్!



గుజరాతిపేటలో ముస్తాబవుతున్న జగన్నాథ ఆలయం



బొందిలీపురంలో జగన్నాథుని రథం

- రేపటి నుంచి జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు
- నగరంలో ముస్తాబైన ఆలయాలు, విగ్రహాలు

శ్రీకాకుళం కల్చరల్: సర్వజగత్తులకు అధిపతి జగన్నాథుడి రథయాత్ర ఉత్సవాలకు వేళయ్యింది. ఆదివారం నుంచి జరగనున్న ఉత్సవాలకు సంబంధించి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఆషాఢమాసం శుక్ల పక్షమి రెండో రోజున జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది.

బొందిలీపురంలో..

నగరంలోని బొందిలీపురంలో కొలువైన జగన్నాథునికి సంబంధించి ఓ పురాణ గాథ ప్రచారంలో ఉంది. ముల్కిదాస్ మహారాజ్ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఆలయాల నిర్మాణం చేపడుతూ శ్రీకాకుళంలోని బొందిలీపురం ప్రాంతంలో సదావర్తి పులహరి తఖియా మఠం పేరుతో ఓ గుడి కట్టారు. ఈ స్థలాన్ని ఆనాడు ఔరంగజేబు ఇచ్చినట్లుగా చెబుతారు. ఆ తర్వాత అతని శిష్యుడు రాజారాందాస్ బావాజీ, దశాబ్దాల క్రితం పూరీ నుంచి విగ్రహాలు తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. దీనిని తెలుసుకున్న ఔరంగజేబు హేళనగా జగన్నాథునికి ప్రసాదంగా ఆవు మాంసాన్ని పంపుతాడు. అది తీసుకొని దానిపై గుడ్డకప్పి జగన్నాథస్వామికి నైవేద్యంగా తీసుకెళ్లి దేవుని ముందుంచారు. అక్కడ గుడ్డ తీయగానే ఆవు మాంసం బదులు మిఠాయిలు కనిపించడంతో ఔరంగజేబు ఆశ్చర్యపోయాడట. వెంటనే తన తప్పు తెలుసుకొని రాజారాందాస్ బావాజీకి క్షమాపణ కోరినట్లు కథ ప్రాచుర్యంలో ఉంది. ఈ గుడిని ఇప్పటి వరకు 11 తరాలకు చెందిన వారు కొలిచినట్లు తెలుస్తోంది. ఇక్కడ రథయాత్ర కొన్ని వందల ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుభాష్ చంద్ర పండా, బ్రాహ్మణ్ బాలు పాణిగ్రహి తెలిపారు. ఇల్లీసుపురం కూడలి వద్ద గుడించా మందిరంలో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఒడిశా రాష్ట్రం పూరీ దేవాలయం మాదిరిగా సంప్రదాయబద్ధంగా ఇక్కడా ఉత్సవాలు జరుగుతాయి. ఈ నెల 7నుంచి 15 వరకు తొమ్మిది రోజుల పాటు వివిధ వేషధారణలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిస్తారు. 11న హీరా పంచమి సందర్భంగా లక్ష్మీదేవిని మేళతాళాలతో ఊరేగింపు నిర్వహిస్తారు.



బొందిలీపురంలో జగన్నాథుని మఠం



బొందిలీపురంలోని జగన్నాథస్వామి



గుజరాతిపేట జగన్నాథ ఆలయంలో విగ్రహాలు

గుజరాతిపేటలో..

గుజరాతిపేటలో జగన్నాథస్వామి దేవాలయం వెనకున్న కథను పరిశీలిస్తే.. తాటిరాజుల కాలంలో ఓ స్వామీజీ పూరీ నుంచి విగ్రహాలను తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. వివిధ పనులమీద ఇక్కడికొచ్చిన గుజరాతీ బ్రాహ్మణులలో ఓ స్త్రీ ఇక్కడి విగ్రహాలను దర్శించుకుని తనను కోర్టు కేసు నుంచి విముక్తి చేస్తే గుడి నిర్మిస్తానని మొక్కుకున్నారు. ఆమె ఆ కేసులో విజయం సాధించడంతో 1864లో రూ.500తో దేవాలయాన్ని నిర్మించినట్లు చెబుతారు. 1994 వరకు భట్ల విశ్వనాథం ధర్మకర్తగా పెంట వెంకటేశ్వరరావు కుటుంబం పూజార్లుగా ఇక్కడ పూజలు జరుగుతుండేవి. ప్రస్తుతం దేవదాయ శాఖ అధీనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడికి సమీపంలోని గుడిశనగుళ్ల వద్ద స్వామిని ఉంచి రోజుకొక అవతారంతో భక్తులకు దర్శనభాగ్యం కలిగిస్తారు. ఈ నెల 7నుంచి 18 వరకు ఉత్సవాలు జరుగుతాయని, రోజుకొక అవతారంతో స్వామి వారు దర్శనమిస్తారని పెంట వంశీయులు తెలిపారు. వెంకటేశ్వరుని అవతారంతో ప్రారంభమై, రాధాకృష్ణులు, సీతారామలక్ష్మణులు, సత్యనారాయణ స్వామి, రామలింగప్రతిష్ఠ, రామ పట్టాభిషేకం, శేషపాన్పు అవతారాలు ఉంటాయని, 18న మారు రథయాత్ర నిర్వహిస్తామని వివరించారు.

ట్రెజరీలకు బిల్లులు పంపించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని ఉన్న గ్రామ పంచాయతీలకు నిధుల్లేక మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామని, అందువలన సబ్ రిజిస్ట్రార్ నుంచి ట్రెజరీలకు బిల్లులు పంపించాలని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు చాంద్ బాషా కోరారు. ఈ మేరకు శుక్రవారం రణస్థలం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధుల్లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం పారిశుద్ధ్య పనులు చేయించలేకపోతున్నామని, మంచినీరు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామన్నారు. బిల్లులు చెల్లించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో లావేరు జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, నాయకులు తిరుపతిరావు, పెయ్యిల లక్ష్మణరావు, పైడిరెడ్డి, ఈశ్వరరెడ్డి, ప్రభాకర్‌నాయుడు, చిట్టిబాబు, సత్యం. సురేంద్ర, లంకలపల్లి గోపి ఉన్నారు.

నిర్విరామంగా లయన్స్ క్లబ్ సేవలు



పొన్నాడ రవికుమార్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: లయన్స్ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్విరామంగా సేవలు కొనసాగిస్తామని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర తెలిపారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పూర్వపు అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ చేసిన సేవలను కొనియాడారు. భవిష్యత్ సేవా కార్యాచరణపై దృష్టి సారించి సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. సెక్రటరీ డాక్టర్ పైడి సింధూర, ట్రెజరర్ జోగి భారతి, వైస్ ప్రెసిడెంట్ బరాటం విశ్వేశ్వరరావు హయాంలో మెంటార్ నటుకుల మోహన్, పూర్వపు జోన్ చైర్మన్ బాడాన దేవభూషణరావు, బి.లక్ష్మణరావు, డి.విష్ణుమూర్తి తదితర సభ్యులతో ముందుకెళ్తామన్నారు. అనంతరం రవికుమార్‌ను సత్కరించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో సృజనాత్మకమైన ఆలోచనలు పెంపొందించాలని రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ బి.రాజేశ్వరరావు అన్నారు. రణస్థలంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యా ప్రవేశ్, విద్యార్థుల సామర్థ్యం పెంపుపై ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సులవుగా పాఠ్యాంశాలపై అవగాహన కల్పించడంతోపాటు పోటీతత్వం అలవర్చాలని సూచించారు. అలాగే విద్యా వ్యవస్థలో సాంకేతిక పాత్రను చక్కగా వివరించాలని చెప్పారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు, ఎంఈవోలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సాయికుమార్



ప్రమాదంపై ఆరా తీస్తున్న సాయికుమార్

రణస్థలం: రసాయనిక పరిశ్రమల్లో ఇటీవల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని.. ఈ నేపథ్యంలో భద్రత పరమైన ప్రమాణాలు తప్పక పాటించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. పిషిణిలోని ఫ్రింజ్ ల్యాబొరేటరీ పరిశ్రమను శుక్రవారం సందర్శించి ఇటీవల జరిగిన ప్రమాదంపై ఆరా తీశారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో అధికంగా రసాయనిక పరిశ్రమలు ఉన్నందున భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే బాధితులు గోవిందరావు, త్రినాథలను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పిషిణి సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పతివాడ సత్యం తదితరులు ఉన్నారు.


సకాలంలో వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రఘురాం

గార: రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని ఎంపీపీ గొండు రఘురాం అన్నారు. శుక్రవారం శ్రీకూర్మం పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో రెండేళ్ల క్రితం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి డయేరియా వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్, వైద్యాధికారి ఎం.మనోజ్‌బాబు, ఎంపీడీవో బి.కల్యాణి, సర్పంచ్ గోరు అనిత, ఎంపీహెచ్‌వో జి.డి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలు



బలగలో వారాహి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలు, పీఠాలలో వారాహీ నవరాత్రి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో వారాహీ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 6 నుంచి 15 వరకు హోమాలు, యంత్రపూజలు, పుష్పాభిషేకాలు జరుగుతాయని, భక్తులంతా పాల్గొనాలని పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ తెలిపారు. కత్తెరవీధిలోని శ్యామా వారాహి సమేత రాజరాజేశ్వరి మహాత్రిపుర సుందరీ దేవీపీఠంలోనూ వారాహీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ తెలిపారు. అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేస్తామని పేర్కొన్నారు.

సజావుగా సాగునీరు అందించాలి



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడికాలువ దిగువ భూములకు సజావుగా సాగునీరు అందించే చర్యలు జలవనరులు శాఖ అధికారులు తీసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సూచించారు. నారాయణపురం కుడికాలువ పరిధిలో ఉన్న భూములను ఫరీదుపేట నుంచి ఓలేటి అగ్రహారం వరకు శుక్రవారం పర్యటించి పరిశీలించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. రైతులకు సమస్య లేకుండా ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులతో అన్నారు. కూటమి నాయకులు చౌదిరి బాబ్జీ, బెండు మల్లేసు, సంపతిరావు నాగేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి ఉన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ



శిక్షణకు హాజరైన రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సైక్ వ్యవసాయ కళాశాలలో రైతులకు తేనెటీగల పెంపకంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోషే మాట్లాడుతూ.. రైతులు తేనెటీగల పెంపకంపై దృష్టిపెట్టాలని సూచించారు. తేనెటీగల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోందన్నారు. తక్కువ ఖర్చుతో తేనెను ఉత్పత్తి చేయవచ్చునని వివరించారు. తేనె పెట్టెల వినియోగం, తేనెటీగల్లో రకాలు, తేనె ఉత్పత్తి పద్ధతులపై అవగాహన కల్పించారు. తేనెటీగల పెంపకానికి రాయితీలు సైతం వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ సంస్థ ప్రతినిధులు, స్థానిక బోధకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్‌జీఓ సంఘ నాయకులు



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్పీ రాధిక



కలెక్టర్‌ను కలిసిన జెమ్స్ ఆర్ఎంవో ప్రవీణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు హనుమంత సాయిరాం, కార్యదర్శి చల్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాల్, పూజారి జానకిరామ్, బడగల పూర్ణచంద్రరావు, బొత్స శ్రీనివాసరావు, హైమావతి, శ్రావణి, జి.లలిత, శ్రీరామ్, ఎర్రంనాయుడు, డి.పార్వతి తదితరులు ఉన్నారు.

శ్రీకాకుళం క్రైమ్: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఎస్పీ జి.ఆర్.రాధిక మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

శ్రీకాకుళం రూరల్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు రాగోలు జెమ్స్ ఆసుపత్రి ఆర్ఎంవో ప్రవీణ్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

పెంచిన చార్జీలు తగ్గించాలి



మాట్లాడుతున్న మాతల గోవర్ధనరావు

శ్రీకాకుళం అర్బన్: జియో, ఎయిర్‌టెల్, ఐడియా తదితర సంస్థలు ఇటీవల పెంచిన మొబైల్ చార్జీలు తక్షణమే తగ్గించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని సంచార భవన్ వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేటు టెలికాం సంస్థలు ప్రజలపై రూ.20వేల కోట్ల మేర మొబైల్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. ప్రయివేటు కంపెనీలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు 4జీ సేవలను అందించలేకపోవడమే దీనికి కారణమన్నారు. ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో బీఎస్ఎన్ఎల్ ఈయూ నాయకులు ఎస్.అభిమన్యు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల వ్యాప్తిని అరికడదాం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

శ్రీకాకుళం అర్బన్: వర్షాల సీజన్‌లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం ప్రాజెక్టు కృష్ణాపార్కు సెక్టారు సూపర్‌వైజర్ పి.సీతారత్నం సిబ్బందికి సూచించారు. నగరంలో కత్తిరివీధి–1, కత్తిరివీధి–2 అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం విష జ్వరాలు, డయేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పరిశుభ్రమైన నీటినే తాగాలన్నారు. పిల్లలకు జ్వరం, వాంతులు, విరోచనాలు వస్తే సొంతవైద్యం చేయకుండా అందుబాటులో ఉన్న ఆసుపత్రులకు తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం 15వ వార్డ్ ఇన్‌చార్జి ఇప్పిలి తిరుమలరావు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎంఎస్‌కేకే.హిమబిందు, విజయ, హైమవతి, విజయమ్మ, అరుణ, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్ బుజ్జమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు ఎంపీ కలిశెట్టి రాక

రణస్థలం: విజయనగరం పార్లమెంట్ సభ్యుడుగా కలిశెట్టి అప్పలనాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారిగా స్వగ్రామం రణస్థలానికి శనివారం రానున్నారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదలైంది.

నేడు కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు

రణస్థలం: పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నివారణ కోసం ఉచితంగా టీకాలను శనివారం వేయనున్నట్టు పశుసంవర్ధకశాఖ రణస్థలం ఏడీ బంటుపల్లి దుర్గారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రి వద్ద ఈ ప్రక్రియను చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పెంపుడు కుక్కల యాజమానులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్య బలోపేతానికి కృషి చేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఉన్న పాఠశాలలో నిర్వహిస్తున్న ఎచ్చెర్ల నియోజకవర్గం, పొందూరు, ఆమదాలవలస మండలాల టీచ్ టూల్ శిక్షణను శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు దృష్టిసారించేలా బోధనలో మార్పులు అవసరమని చెప్పారు. విద్యార్థి కేంద్ర బిందువుగా విద్య ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ కారు పున్నయ్య, రీసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 7న జరగనుందని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి మురళీమోహనరావు, దానేటి కేశవరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరసవల్లి సమీపంలో ఉన్న సంఘ నూతన కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి కార్యవర్గంతోపాటు అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

రణస్థలం: ప్రతీ గ్రామం పరిశుభ్రంగా ఉండాలని, స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పంచాయతీ అధికారులు పని చేయాలని జిల్లా ఆడిట్ అధికారి, పారిశుద్ధ్య స్పెషల్ అధికారిణి ఎం.సూల్తానా బేగమ్ అన్నారు. రణస్థలం, పాతర్లపల్లి, కోష్ట, జె.ఆర్.పురం పంచాయతీల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలని సూచించారు. కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

జి.సిగడాం: మెట్టవలస గ్రామంలో సర్పంచ్ కామొజుల ఆరుద్ర ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. దీనికి యువకులు సహకరించాలన్నారు. స్థానిక నాయకులు బెవర జగన్నాథం, కామొజుల సీతారాం, కార్యదర్శి ధర్మవరపు సతీష్, ఏఎన్ఎం కె.నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ కె.జయ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

గుర్రాలపాలెంలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేరు మండలం గుర్రాలపాలెం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ సర్పంచ్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో వీధుల్లో చెత్తను, కాలువల్లో పూడికను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. సచివాలయ సిబ్బంది పనులను పర్యవేక్షించారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో దేవీ విగ్రహానికి పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావటంతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. కుంకుమార్చనల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయదుర్గకు విశేష అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలువీధిలో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమపూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.